# ఫాషన్

-ఓగేటి ఇందిరాదేవి, Hyderabad A.P.

రెండువేల ముప్ఫైయ్యవ సంవత్సరం...రాజధానీ నగరంలో పురావస్తుశాఖ ప్రదర్శనలు జరుగుతున్నాయి.

శుభద మనవరాలు షోబాని తీసుకుని ఆ ఎగ్జిబిషన్‌కి వెళ్ళింది. ఆ అమ్మాయిని వప్పించటానికి తాతలు దిగొచ్చారు శుభదకి.

ఈ ముసలమ్మ చాదస్తానికి చస్తున్నాను. ఇప్పుడా ఎగ్జిబిషన్‌కి వెళ్ళకపోతే ఏం కొంపలు మునిగిపోతాయిట? అని విసుక్కుంటుంటే తల్లి వాసంతి నచ్చచెప్పి పంపించింది.

యధాప్రకారంగా షార్ట్స్ వేసుకుని పైన చిన్న బనీనులాంటి టీషర్ట్ వేసుకుని ఎర్ర రంగువేసుకున్న బాబ్‌డ్ హెయిర్ మొహమంతా పడేట్టు దువ్వెనతో సరిచేసుకుని ఎత్తు మడమల చెప్పులు వేసుకుని జయల్దేరింది షోబా. నడుముకి వెడ్డల్పాటి బెల్టు పెట్టుకుంది.

'గాజులు వేసుకోకపోతే పోయావు, చిన్నచుక్కలా బొట్టయినా పెట్టుకోకపోయావా?' అన్నది శుభద.

'ఛ మొహమ్మీద అట్లా పిచ్చి పిచ్చి రంగులు అతికించుకోవటం ఛండాలంగా వుంటుంది. అమ్మమ్మా! నీకేం తెలీదు నవ్వు పాతశతాబ్దం మనిషివి. ఈ షోబా ఇరవయ్యొకటీ శతాబ్దంలో వుంది-అదే పుట్టింది.'

'షోబా షోబా అంటుంటే వినలేకపోతున్నానే తల్లీ! చక్కగా శోభ అనే పేరు పెట్టుకుని అవికారపు ఉచ్చారణేమిటే. 'భాధపడింది అమ్మమ్మ.

'నీకే పిచ్చి పేరుపెట్టింది చాలక ఇంకెలాగో అనమంటావ్, నా పేరు చూసి నవ్వుతునారసలే సియారల్, నెగూబా, షష్కాలు.' విసుక్కుంది షోబా.

ఎలాగో ఇద్దరూ సమాధానపడి ఎగ్జిబిషెన్‌కి బయలుదేరారు.

.....అక్కడ

ఒకచోట ఆకుపచ్చ పరికిణీ దాని మీద ఎర్రని ఒణీ, జాకెట్టూ కట్టిన బొమ్మ వుంది.

'అరె అమ్మమ్మా! ఇదేమిటీ బుట్టబొమ్మ అంటుంటావు ఇదేనా? గంపెడు గుడ్డలతో బలేగా వుండే, పాపం ఎట్లా మోస్తుందో ఇప్పీ. అరె నడుముకిదేమిటీ? ఆ చెవులకి చేతులకి కాళ్ళకి జడలో అవన్నీ సొమ్ములే...ఏర్నాయినో! జడేసుకోవటమే బోర్, పైగా అన్నీ సోమ్ములు ఎంతబరువో గాడ్!' అని విస్తుపోయింది షోబా.

'అది బుట్టబొమ్మ కాదు శోభా! మా చిన్నప్పుడు ఇలాంటి బట్టలేసుకునే వాళ్ళం. అనుకుంటున్నారు గాని మీ బట్టల కంటే తేలికేలే వడ్డాణం నడును పెరక్కుండా చూస్తుంది. వంకీలు చేతులు లావుకాకుండో కాపాడుతుంది. పద పద మనం తర్వాత వాదించుకుందాం. ఆపక్క షోకేసులో ఇంకో బొమ్మ వుంది చూద్దాం.' అంటూ దారి తీసింది శుభద.

ఆ షోకేసులో తొమ్మిది గజాల చీర కాసె పోసి కట్టుకుని కొప్పు పెట్టుకున్న బొమ్మ వుంది.

'వాట్ ఇదేమిటీ అమ్మమ్మా! ఈ వింత మనిషి ఇలావుంది' ఆశ్చర్యపోయింది షోబా.

శుభద కూడా నవ్వింది. 'నేను కూడా ఈ రకం వేషధారణ నేనూ సరిగ్గా ఎరగను. బాగా చిన్నప్పుడు మా పెద్దనాయనమ్మ ఇట్లాగే చీరకట్టుకునేది. అదిగో ఈ బొమ్మకున్నట్లే పసుపు రాసుకున్న కాళ్ళకి గొలైపు గొలుసులు పట్టాలు, మెళ్ళో జిగినీ ముక్కుకి నత్తు ఎర్రరాళ్ళ కమ్మలు ఇలాగే వుండేది. అప్పుడు లోపలి లంగాలు లేవుగా ఇట్లా బట్టకట్టుకుంటే ఒళ్ళంతా కవర్ అయ్యేది. అవి కూడా చేనేత చీరలూ, పట్టు చీరలూనూ.'

'ఏమిటో అమ్మమ్మా అయోమయంగా వుంది. జుట్టంతా కుడివైపుకు లాగి జుట్టులో దూర్చారు. నూనె రాసి మధ్యపాపిడి తీసి కిందకి నున్నగా దువ్వి...ప్స్..'

దాన్ని కొప్పు అంటారు శోభా. మా అమ్మ చెప్పుండేది తెలుగులో శ్రీనాథుడనే కవి వుండేవాడట. 'ముడువంగనేర్తురు మూల దాపటికిరా చికూర బంధంబులీగ జేరువార' అని స్త్రీ ని వర్ణించాడట. నూనెరాసి నున్నగా దువ్వి కొప్పు పెట్టుకుంటే ఆ నునుపుదనానికి ఈగవాలినా నిలవలేక జారిపోయేదిట. నున్నగా అప్పుడట్లా ఫాషను, ఇప్పుడు నీలా చక్కటి జుట్టును కత్తిరించుకుని ఎర్ర రంగువేసుకుని పిచ్చిగా పీక్కోవటం ఫాషను.'

'అమ్మమ్మా' గునిసింది శోభ.

'సర్లే నిన్ను కాదులే, ఇంకోబొమ్మ చూద్దాం పద.' అనునయంగా మనవరాలి చెయ్యి పట్టుకుంది శుభద ఆసరాకోసం అన్నట్టు.

ఇద్దరూ ఇంకో బొమ్మ దగ్గిర ఆగారు. ఆ బొమ్మ కాస్త పెట్టి చేతుల జాకెట్ వేసుకుంది. మామూలు చీర కట్టు, సింథటికిశారీ, మోడరన్ స్టయిల్లో ముడి, ఒక చేతికి వాచీ ఇంకో చేతికి ఒక్కటే బంగారు గాజు, కాళ్ళకి చెప్పులు, మెళ్ళో గొలుసు.

'అమ్మమ్మా! ఇది ఈ డ్రస్సు నాక్కొంచెం తెలుసు ఔనా'అంది షోబా.

'ఔను దీన్ని గూడకట్టు అంటారు. లోపల లంగా కట్టుకుని పైన సింథటిక్ చీర కట్టారు చూడు. జాకెట్ కిందుగా బ్రా వుంది గమనించావా? ఇదివరకు వాళ్ళు ఈ బ్రా లేకపోతే అసహ్యం కదూ' అన్నది శుభద.

'ఆ ఔనౌను అమ్మయ్య కస్త చూడొచ్చా ఈ బొమ్మని బ్రా లకపోతే అసహ్యం కదూ' అన్నది షోబా.

శుభద నవ్వింది. 'మా కాలం వుద్యోగినులు ఫాషను ఈ డ్రెస్సు. అప్పుడప్పుడు మంచి మంచి కాటన్ చీరలు కూడా కట్టేవాళ్ళం అనుకో.'

'ఔను అమ్మ కూడా అప్పుడప్పుడు కట్టుకుందిగా చీరలు' అంది షోబా. 'తెలుగువాళ్ళ సంస్కృతి గోదావరి పెన్నా కృష్ణలో కలిసిపోయింది గదా అని నిట్టూర్చింది శుభద.' ఇద్దరూ ఇంకో బొమ్మ దగ్గికెళ్ళారు.

పంజాబీ డ్రెస్ వేశారు బొమ్మకి. రెండు జడలు ఒక మోస్తరు ఎత్తు చెప్పులు కనపడి కనపడకుండా బొట్టు.

తర్వాత పాంటు,షర్టు వేసుకున్న బొమ్మ చూశారు. బొట్టు లేదు, పాపిడి మాయమైంది. గాజుల్లేవు. ఎత్తుమడమల బూట్లు.

ఇంకో బొమ్మ దగ్గిరకి వెళ్ళారు. . హాట్ పాంట్ పైన బనీను ఎర్రరంగు జుట్టు చిందరవందరగా రేగి వుంది. పెదవులకి లిప్‌స్టిక్ కనురెప్పలకి మస్కారా చేయించుకున్న కనుబొమలు కత్తిరించుకుని, మొహానికి లైట్ మేకప్, నడుముకు ఇంత వెడల్పు బెల్టు..... చివరగా ఇంకో బొమ్మ ద్గరికొచ్చారు. అమ్మమ్మా మనవరాలు ఆ బొమ్మ నైటీ వేసుకుంది. బ్రా వేసుకుంది. లోపలి లంగా కట్టుకుంది.

వాటిపైన నైటీ. 'అమ్మయ్య ఈ చివరి బొమ్మలన్నీ నాకు అర్ధమై పోయాయి అమ్మమ్మా హోయిగా చూడబుల్‌గా వున్నాయి ' అంది షోబా.

శుభదకి తన ఆడబిడ్డ సలహా గుర్తొచ్చింది. 'ఛ ఛ ఏమిటొదినా! ఈ కోలంలో కూడా ఇట్లాంటి పాత డ్రెస్ వేసుకుంటావు? ఇంట్లో చీర కట్టుకోవటమేమిటీ ఛండాలంగా? హోయిగా గాలి తగిలేట్లు నైటీ వేసుకోరాదూ?' అనేదావిడ.

'ఏమిహోయమ్మా, లోపలి లంగా వేసుకుని బ్రా వేసుకుని పైన కదా నైటీ వేసుకోవాలి. పైనించి గొట్టంలా కొండొకచో పాంటీస్ కూడా వేసుకోవాలేమో కదా. ఈ గంతా బొంతా వేసుకుని పైన సిలిండరు షేపులో ఈ నైటీ వేసుకోవటం ఏం హోయి తల్లీ. చూసేవాళ్ళకి మన మీద గొప్ప గౌరవం కలుగుతుంది! అసలు ఈ దేశానికి అగ్గి అంటుకుంటే చటుక్కున లాగి పారేయ గలిగిన వస్త్రధారణ కావాలిటతెలుసా? చలిదేశం వాళ్ళకి ఒంటికి అంటుకునుండే వస్త్రధారణ కావాలిట .'అనేది గాని తను ఆడబిడ్డ మాట వినేది కాదు ఈ ఒక్క విషయంలో.

'ఏమిటి ఆలోచిస్తున్నావు అమ్మమ్మా! అటువైపు పద ఇంకొన్ని బొమ్మలున్నై చూసెళ్దాం 'అంటూ లాక్కెళ్ళింది షోబా.

పాతవాటిల్లో ఒక బొమ్మకి పంజాబీ డ్రెస్, ఒక బొమ్మకి గుజరాతి, ఒక బొమ్మకి మార్వాడి, కొన్ని బొమ్మలకి కేరళ, తమిళ, ఒరియా డ్రెస్సులు వేసి వున్నై. కాని మొత్తం మీద భారత దేశంలోని అన్ని ప్రాంతాల ప్రస్తుత డ్రెస్సూ, షోబా వేసుకున్నటువంటిదే.


'ఆహా ఏం జాతీయ సమైక్యత. ఒహో ఏం జాతీయ సమైక్యత మనసులోనే గుండెలు బాదుకుంది శుభద.'

నాగరిక స్త్రీలు సాధించిన ప్రగతికి షోబా కూడా మురిసిపోయి కొత్త డ్రస్సులన్నీ చూసింది. ఎంత తక్కువ బట్టతో వాటిని కుట్టించుకో వచ్చో అని మరింత మురిసిపోతూ అనుకుంది.

ఇంతలో బిలబిల్లాడుతూ ఇతర దేశస్థులు కొందరు ఆ ఎగ్జిబిషెనుకి వచ్చారు.. వాళ్ళంతా ఒంటినిండా చీరలు కట్టుకున్నారు. నిండుగా జాకెట్ వేసుకున్నారు, జడలు వేసుకున్నారు. జుట్టు పెంచుకుని ముడులు వేసుకున్నారు. యువతులు పరికిణి ఒణీ వేసుకున్నారు.'

' కలా నిజమా 'అని విస్తుపోయింది శుభద. ఆ మాటే వాళ్ళ నడిగింది.

' మాకు ఇప్పుడు మీ డ్రస్సులే ఫాషన్, చూడ్డానికి అందంగా వుంటాయి. మర్యాదగా వుంటాయి. కట్టుకుంటే హోయిగా వుంటాయి' అన్నారు వాళ్ళు.




# వృక్ష విలాపం

తే॥గీ॥ అమ్మవై నిన్ను సుతుడుగా నమ్ముకొంటి
పాలు ద్రాగిన రొమ్మునే పట్టజూచు
నీచ భావాలు నీలోన నింపుకొన్న
నరుడ! నీ బుద్ధి మార్చుకో! నన్ను వదలు!

తే॥గీ॥ కమ్మగావీచు గాలి నా కొమ్మనుండి
వాన ననుజూచి మోహించి వచ్చు ధరకు
ఎండ నీ కంటకుండ, కూర్చుండ నీడ
నిచ్చి హర్షించు నీ తల్లి నేలుకొమ్ము!

తే॥గీ॥ పూలు కాయల నాకులను పొందినావు
అన్ని సౌఖ్యాలు నా నుండి యందుకొనుచు
చెట్లు నరుకగ నీకేల చేయి కదిలె
నన్ను రక్షించవేల ఓ కన్నకొడుక!

-మాడుగుల భాస్కరశర్మ
**Hanmakonda, AP**


# CALL INDIA FOR 59¢ / MIN

## ANYTIME 24 HRS. / DAY - 7 DAYS / WK.

| Country | ¢/minute | Country | ¢/minute |
|---|---|---|---|
| Australia | 49 | Japan | 59 |
| Canada | 29 | Singapore | 59 |
| Hong Kong | 59 | UK | 39 |
| Bahamas | 59 | Norway | 59 |
| France | 59 | Switzerland | 59 |

(Minimum Purchase $100 & $5 Processing fee = 170 Minutes to India)

**No** Activation Fees
**No** Monthly Fees
**No** Added Surcharge
**No** Fine Print
**No** Switching Present Carrier
**No** Minimum Usage Required

**SEND YOUR CHECK OR MONEY ORDER TO:**

U.S. Universal INC.
N5152 Summit Drive
Fond du Lac, WI 54935

1-800-929-9996
Tel: 414-929-8696
Fax: 414-922-7024

Laxman Kailas, President

**DOMESTIC LONG DISTANCE LOW RATE CARDS ALSO AVAILABLE**